కథ

# యారాడరావు అందలం ఎక్కాడమ్మా

— డాక్టర్ రాగతి రమ

ఒకసారి కాదు వందసార్లు అద్దంలో చూసుకుంటున్నాడు యారాడరావు. ఎన్నిసార్లు చూసుకున్నా అందంగా కనిపిస్తూనే వున్నాడు. వచ్చిన చిక్కంతా ఉద్యోగం లేకపోవడం మీదే వుంది. కల్పన అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

ఒకరోజు సాయంత్రం తన ఇంటికొచ్చింది మామయ్య కూతురు కల్పన.

"ఒసే కల్పనా బావని పెళ్లి చేసుకుంటావటే!" తన తల్లి సీతమ్మ అడిగితే భళ్లున నవ్వి—

"ఉద్యోగం సద్యోగం లేని వాడిని ఏం చేసుకోమంటావు అత్తా?" అంది.

దానికి తల్లి— "నా కొడుకు ఎంత అందగాడో తెలుసు కదే ఆ అందం చూసైనా చేసుకోవటే!" అంది.

ఆ మాటకి మూతి తిప్పి— "అందాన్నేమన్నా కొరుక్కు తింటామా అత్తా...రూపాయి పువ్వులు పెళ్లానికి కొనాలంటే ఎలా కొంటాడే....నిన్ను అడుక్కోవాలా నేను...! అంది కళ్లెగరేస్తూ.

"అబ్బో ఎంత గడుసు పిండానివై పోయావే... చూస్తూ వుండు త్వరలోనే మా యారాడరావు ఉద్యోగం సంపాదించి నీ మెళ్లో మూడు ముళ్ళు వేస్తాడు. అప్పుడు నీ తిక్క కుదురుతుంది...ఏమంటావురా యారాడా...?"అంది తల్లి.

మరోసారి భళ్ళుమంది కల్పన— "యారాడట యారాడ ఏం పేరు పెట్టావు అత్తా!" అంది.

ఛీ వెధవ పేరు...అప్పుడెప్పుడో తొమ్మిది నెలల కడుపుతో యారాడ కొండకి పిక్నిక్కి వెళ్లింది ఈ అమ్మగారు. ఇంకేముంది పురుటి నొప్పులు వచ్చి అక్కడే పుటుక్కున పుట్టేసాడు తను. తనకేమో 'యారాడరావు' అని పేరు తగిలించేసింది. ఈ పేరు చూసి అందరూ నవ్వడమే...ఈ కల్పనైతే మరీను...ఉద్యోగం వచ్చాక ఈ చచ్చుపేరు తీసి పక్కన పెట్టాలి. యారాడరావు ఆలోచిస్తూ వుండగా— "ఏమిటి బావా మాట్లాడవు...?" అంటూ చిలిపిగా నవ్వింది కల్పన. యారాడరావు కోపాన్ని అదిమి పట్టి ఆమెవేపు చూసాడు.

"నీకు ఆరు నెలలు టైం ఇస్తున్నా ఉద్యోగం సంపాదిస్తావో వూళ్లే ఏలుతావో నీ ఇష్టం...ఈ ఆరు నెలల్లో నీకు ఉద్యోగం సద్యోగం రాకపోతే నేను మరొకడితో మూడు ముళ్లు వేయించుకుంటా." ఆ మాటలు సూలాలే.

మరొకడంట మరొకడు...ఆ మరొకడు ఎవరు ముందే పరిచయం వున్నవాడా...వూగిపోతోంది యారాడరావు మగ మనస్సు.

నూరు ఆరైనా ఆరు నూరైనా కల్పనకు మొగుడు తనే. ఎవడొస్తాడో చూస్తా అనుకున్నాడే గాని మనసులో అశాంతి పొరలు పొరలుగా గడ కట్టుకు పోతోంది.

కల్పన దృష్టిలో తనకు విలువ లేదు. తనో చచ్చు చవట— ఉద్యోగం సంపాదించుకోలేని బడుద్దాయి. మామయ్య దృష్టిలో తను ఏ పంటా పండని బంజరు భూమి లాంటి వాడు. కుచించుకు పోతున్నాడు తనలో తాను. ఐదు ఏళ్లయింది చదువు పూర్తిచేసి— ఇంతవరకు ఉద్యోగం లేదు.

"మా కల్పనకు ఎన్నో సంబంధాలొస్తున్నాయి. ఇంతకాలం ఏదో వూడ బొడుస్తావని నీకోసం అట్టే పెట్టి వుంచాను దాన్ని. ఇంకో ఆరు నెలలే నీకు టైం ఇస్తున్నా. ఉద్యోగం సంపాదించలేక పోయావో దాన్ని ఇంకొకడికిచ్చి చేస్తా కాస్త బుర్ర పెట్టి ఆ పరీక్ష లేవో రాయరాదా?" అన్నాడు కల్పన తండ్రి.

"ఆ వీడు ఉద్యోగం సంపాదించినట్లే— పెళ్లాన్ని పోషించినట్లే...నాకు నమ్మకం లేదు. వేరే సంబంధాన్ని సెటిల్ చేసుకోండి" అన్నాడు యారాడరావు తండ్రి.

"ఇదిగో బావా ఇంక ఆరు నెలలే గడువు" బెదిరిస్తున్నట్లుగా అంది కల్పన.

ఆరు నెలలు ఆరు యుగాలు కాదు. ఆరు క్షణాలు. అవిరైపోతాయి కళ్లు మూసి తెరిచేటంతలో. ఉద్యోగం వస్తుందా— రాదా కల్పన పెళ్లికి ఒప్పుకుంటుందా...లేదా...ఆలోచనలు పాడు ఆలోచనలు...మనిషిని నిస్సహాయ స్థితికి తీసుకుపోయే ఆలోచనలు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు యారాడరావుకి. తనో మరుగుజ్జు అనుకున్నాడు. చీకటి తర్వాత వెలుగంటారు— ఎక్కడుంది వెలుగు...! ఆ మధ్యన ఆఫీసర్ పోస్టులకు పరీక్ష రాసాడు. రేపే రిజల్ట్స్ వస్తాయట...మనసు విసిగి పోతోంది పరీక్షలు రాసి రాసి— ఎదురు చూసి చూసి— నిరాశలో కొట్టుకొని కొట్టుకొని చచ్చిపోతోంది. వయస్సు కూడా బారెడు పొడుగు పెరిగి పోతోంది. ఇంక ఉద్యోగాలకి పరీక్షలు రాసే ఛాన్స్ కూడా పోతుంది.

బాధగా కళ్లు మూసుకున్నాడు యారాడరావు. కనుకొలకుల్లో నిలిచిన ఓ కన్నీటి బొట్టు రాలి గుండెలపై పడింది. ఎలా తెల్లారిందో యారాడరావుకి గుర్తులేదు గాని తెల్లవారే న్యూస్‌పేపర్లో తన నెంబర్ చూసుకుంటే ఒంటిమీద స్పృహ పోయింది. పేపర్లో నెంబరుంది. ఆనందం— ఆనందమే ఆనందం. రాత్రి కన్నీరు సంతోషాన్ని అద్దుకొని వరదలై పారింది.

కొద్దిరోజుల్లోనే ఇంటర్వ్యూ జరగడం, అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికి రావడం జరిగిపోయింది. రేపే హైదరాబాద్ ప్రయాణం. యారాడరావుకి ఎంతో ఎత్తుకి ఎదిగిపోయినట్లుగా వుంది.

కల్పన, ఆమె తండ్రి వచ్చారు.


"మా వాడికి ఉద్యోగమే రాదనుకొన్నావు కదూ కోడలా ఇప్పుడు చూడు ఆఫీసరై కూర్చున్నాడు." నవ్వుతూ అంది సీతమ్మ. మామయ్య నవ్వుతూ— "ఒరే యారాడా ఇక ముహుర్తాలు పెట్టెయ్యడమే తయారుగా వుండు" అన్నాడు.

"ఆరు నెలలు గడువిచ్చాను గాని మూడు నెలల్లోనే ఉద్యోగం సంపాదించేసావు బావా...అలా వుండాలి – మన పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాను" అంది కల్పన కళ్లు తిప్పుతూ. యారాడరావు మాట్లాడలేదు. నవ్వుతూ వూరుకున్నాడు.

హైదరాబాద్ వచ్చి ఆరునెలలైంది. హోదా పెరిగింది. టీవి వచ్చింది. విందులు వినోదాలు హెచ్చయ్యాయి. అటువంటి సమయంలోనే తండ్రి యారాడరావుకు ఉత్తరం రాసాడు కల్పనను చేసుకోమని మామయ్య తొందర పడుతున్నాడు ముహుర్తాలు పెట్టించమంటావా అంటూ. ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకోను అంటూ జవాబిచ్చాడు యారాడరావు.

ఆ ఉత్తరం చూసాక సందేహం కలిగింది కల్పనకు. బావకు తన మీద కోపం వచ్చింది. ఉద్యోగం లేని రోజుల్లో బావను చేసుకోను పొమ్మంది తను అందుకనే నేమో...! కల్పన వెంటనే యారాడరావుకి ఒక లెటర్ రాసింది. అతనంటే తనకెంత ప్రేముందీ అతనంటే తను ఎంత పడి ఛస్తుందీ రాసింది.

యారాడరావు ఆ ప్రేమలేఖ చదువుకొని చాలా



నిశ్శబ్దంగా దాన్ని చించి డస్ట్‌బిన్‌లో పడేశాడు. కల్పన సమాధానం కోసం ఎదురు చూసి చూసి మరో లెటర్ రాసింది. యారాడరావు దగ్గర్నుంచి ఏ రిప్లయి రాలేదు. కల్పన నిరాశ పడకుండా మరో లెటర్ రాసింది. ఆదే సమయంలో కల్పనకో అనుమానం వచ్చింది. బావ ఎవరో అందమైన అమ్మాయిని ప్రేమించాడేమో అందుకే తనకు సమాధానం రాయడానికి ఇష్టపడటం లేదేమో! అలా అనుకోగానే కల్పనకు ఈర్ష్యగా అనిపించింది. ఇంకా బాధగా దుఃఖంగా కూడా అనిపించింది.

యారాడరావు జీవితం హుషారుగా సాగిపోతూ వుంది. ఒక గుమస్తాగా జీవితం సాగిస్తే ఇంత ఆనందం వుండకపోను. ఒక హోదా వచ్చిం తర్వాత అతనికి ఎవర్ని చూసినా పిపీలికాల్లా కనిపిస్తున్నారు. మామయ్య ఒక పిపీలికం– కల్పన ఒక పిపీలికం...ఉగాది పండక్కి ఇంటికి రమ్మని తండ్రి ఉత్తరం రాసాడు. అందులో కల్పనతో నీ పెళ్లికి ముహుర్తాలు పెట్టేయమంటున్నాడు మామయ్య. నీ సమాధానం ఏమిటి అంటూ రాసాడు.

మరో సంబంధాన్ని వెతుక్కోమనండి అంటూ జవాబు రాసాడు యారాడరావు. ఆ ఉత్తరం చదవగానే గుండె ఆగినట్లయింది కల్పనకు.

"పేద్ద ఆఫీసరై పోయాడు కదూ అందుకే కొమ్ములొచ్చాయి వాడికి– ఇంతకంటే మంచి సంబంధమే చేస్తాను నా కూతురికి చూస్కో" అంటూ రుసరుస లాడి పోయాడు మామయ్య.

ఎందుకు తనంటే బావకు ఇష్టం లేదు. ముఖాముఖి తేల్చుకోవాలనుకుంది కల్పన. ఆరోజు రానే వచ్చింది.

–ఉగాది పండక్కి విశాఖపట్నం వచ్చాడు యారాడరావు. కల్పన యారాడరావుని ఒంటరిగా కలుసుకుంది. అతనింట్లోనే. సీతమ్మ వంటింట్లో లడ్డూలు చేస్తూ వుంది. తండ్రి ఇంట్లో లేదు.



### మోహన్‌బాబు వెరైటీ

ప్రతిసారీ ఫంక్షన్స్‌కి మన తెలుగువాళ్ళని పిలిచి అరిగిపోయిన రికార్డులాంటి పాత పొగడ్తల్లే వినడానికి బోరు కొట్టింది కాబోలు హీరో మోహన్ బాబుకి, ఈసారి వెరైటీగా తన 'యమ జాతకుడు' సినిమా ఆడియో క్యాసెట్ ఆవిష్కరణ రామోజీ ఫిల్మ్ సిటీలో పెట్టి ముఖ్య అతిథిగా హిందీ హీరో షారుక్‌ఖాన్‌నీ, ఇంకా అమ్రిష్‌పురి లాంటి వాళ్ళని పిలిచాడు.

మేడమీద గదిలో వున్నాడు యారాడరావు.

పక్షులు గుంపులు గుంపులుగా ఇళ్లకు వెళ్తున్నాయి. డాబా మీద కొబ్బరి ఆకులు గలగలాడుతూ వూసులు చెబుతున్నాయి. తోటలో సంపెంగి చెట్టుకు విచ్చుకున్న పువ్వులు సువాసనని రాయబారం పంపుతున్నాయి. అటువంటి సమయంలో యారాడరావు తీరిగ్గా కుర్చీలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నాడు.

ఏదో అలికిడైతే తలెత్తి చూసాడు యారాడరావు. ఎదురుగా కల్పన నిలబడి వుంది. ఏమనాలో తోచలేదు యారాడరావుకి.

"నేను రావచ్చా" అంటూ చనువుగా కల్పన మంచం మీద కూర్చుంది. అడిగేయ్ అడిగేయ్ అంటూ మనస్సు గోల పెడుతూ వుంది. ఒకప్పుడు ఇతని చెవులకు తాటాకులు కట్టేది- ఇప్పుడేమిటి ఇంత భయం నోరు విప్పాలంటే! ధైర్యం తెచ్చుకొని- "నన్ను పెళ్లి చేసుకోవడం నీకు ఎందుకు ఇష్టం లేదు బావా?" అంది చిన్నగా.

చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"ఎవరినైనా ప్రేమించావా?" ఆ గొంతులో బాధ యారాడరావు గుర్తించాడు. చిన్నగా నవ్వి తల అడ్డంగా తిప్పాడు.

"నేనంటే నీకు ఇష్టం లేదా?"

ఇబ్బందిగా కదిలాడు యారాడరావు.

"చెప్పు బావా చెప్పు అదే నన్ను ఎందుకు చేసుకోవు?"

ఈ ప్రశ్నకు సమాధానం కావాలి."

యారాడరావు ఒకసారి కల్పనవేపు చూసి-

"ఏమో!" అన్నాడు.

"చెప్పు బావా చెప్పు నీకు ఉద్యోగం రాక మునుపు నేనన్న మాటలకేనా కసి పెంచుకున్నావ్...?"

యారాడరావు తల అడ్డంగా తిప్పాడు.

"అర్జెల్లు టైమిచ్చి ఇంకొకడితో మూడు ముళ్లు వేయించుకుంటానన్నాను. అందుకేనా నన్ను కాదన్నావ్...?"

యారాడరావు "కాదు" అన్నాడు ముక్తసరిగా.

"మరి ఎందుకు కాదన్నావ్ చెప్పు బావా చెప్పు.. నాకు తెలుసు...ఎంతో ఎదిగి పోయావు ఇప్పుడు నీ దృష్టిలో ఆఫ్ట్రాల్ కల్పన. నీకు సరి తూగని కల్పన నన్ను చేసుకోనందుకు ఎప్పటికైనా విచారిస్తావ్ అది తెలుసుకో.. ."కల్పన దుఃఖంతో వెళ్లిపోయింది.

యారాడరావు పెదవులపై సన్నని చిరునవ్వు పెరిగింది. ఒకప్పుడు కల్పన దూరం అయిపోతుందేమోనన్న భయంతో ఏడ్చాడు. కల్పన దృష్టిలో విలువ లేనందుకు ఏడ్చాడు. కల్పన వెక్కిరిస్తే ఏడ్చాడు.

కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు. తను ఇప్పుడు నిరుద్యోగా కాదు- చిరుద్యోగి కాదు ఆఫీసరు. నెలకి పదివేల రూపాయలు సంపాదించే ఆఫీసరు.

కల్పనలో అందం వుందా లేదు- లౌక్యం వుందా లేదు- గర్వం వుందా లేదు...కల్పన ఒక ఆఫీసరు భార్యగా పనికిరాదు.

ఒక గుమస్తా భార్యగా సరిపోతుంది. ఒకటి నిజం కల్పన తెలివైందే. తన మనసులో మాట పోల్చేసింది. అయినా కల్పన ఆఫ్ట్రాల్ కల్పన.

యారాడరావు స్టయిల్‌గా సిగరెట్టు వెలిగించి దమ్ము లాగాడు ఎక్కడ మంచో- 'అందలం ఎక్కాడమ్మ అందకుండ పోయాడమ్మా' అనే పాట వినిపిస్తూ వుంది.

# విన్నపాలు

పాతాళంలో ప్లూటో కన్నీళ్లల్లో నెప్ట్యూన్ గాన గర్వంతో ఆర్ఫ్యూస్ ముసలి పెళ్ళాం మొగుడు యూలిసిస్ ఎన్నన్నా చివరికి ఇనీయే ఎముక వున్న శివలింగం ముమ్మారు స్ఖలించి త్రైలోకాల్ని సృజించి - దంణ్ణమూ దండకమూ దండమూ నాటకమూ నటనా నయవంచనమూ పురాతనమూ సంస్కృతీ నాగరీకమూ నియమమూ నీతీ నీయంత్రితమూ - పంచ భూతాల పాంచ భౌతిక పాచికలు ఆత్మాహుతిలో ఆహ్వానించిన చన్నీళ్ళ చినుకులు ప్రసవించే శిశువు వేదనలో శపించిన మాతృశ్రీ కామం పేగు తెంచిన క్షణంలో నేర్చుకోవాల్సిన భాష ఈనిన జాంతిక ధరా గర్భంలో పెట్టుకోవాల్సిన లింగం వూనిన సాంఘిక జనారణ్యంలో తెచ్చుకోవాల్సిన కులం చిరు చిల్లులు పొడిచిన చుక్కల వినీలాకాశం నడిచొచ్చే ఉత్సవ విగ్రహాల శిథిలాయాలు రహదారి మధ్యలో గాయపడేదెప్పుడూ పరదేశ్ పునః సముద్రం మీద యూలిసిస్ చంపబడేది రాక్షస పుత్రుడి చేతుల్తోనే వాడేవన్నా కాళ్ళు తడవని జలయోగి ఏమన్నానా నిను నువ్వు కేకేసుకొంటూన్నపుడు నీ వేళ్ళే నీ గొంతుని నులుముతయ్

—'మో'